సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్రజల మనిషి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు

మల్కాపురం: భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రజల మనిషి అయిన పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజల కోసం చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు అన్నారు. దివంగత నేత సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం 59వ వార్డు నెహ్రూనగర్‌లో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.లక్ష్మణమూర్తి,దుర్గారావు,రాజారావు,సురేష్,రాము తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: విద్యార్థి దశ నుంచే వివిధ రకాల నైపుణ్యాలు నేర్చుకోవడం పై దృష్టి పెట్టాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. భావ ప్రకటన నైపుణ్యాలను,వృత్తి విద్య నైపుణ్యం,యాజమాన్య, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

50 కిలోల నిషేధిత ప్లాస్టిక్ సంచుల పట్టివేత



ఏఎంహెచ్‌వో అప్పలనాయుడుకు ప్లాస్టిక్ సంచులు అందిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ సంచులను జీవీఎంసీ అధికారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పట్టుకున్నారు. పలు దుకాణాల్లో జేడీ ఫౌండేషన్ సభ్యులు, జీవీఎంసీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 50 కిలోల పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని జోన్-8 కార్యాలయంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడుకు అందించారు. వీటిని డంపింగ్ యార్డుకు తరలిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎదురువానిపాలెం గ్రామ ప్రజలు

మహారాణిపేట: ములగాడ మండలం ఎదురువానిపాలెంలో అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేసి ఆ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ఎదురు సన్యాసిరావు ఆధ్వర్యంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 17/1,17/3లో ఇచ్చిన పట్టాల్లో అనేక మంది అనర్హులు ఉన్నారని, వాటిని రద్దు చేసి కల్యాణ మండపం నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని సన్యాసిరావు అన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

నీటిని ఒడిసి పడదాం

ఇంకుడు గుంతలపై జేడీ ఫౌండేషన్ ఫోకస్ • విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



నీటికి జీవికి విడదీయరాని బంధం... నీరు లేనిదే జీవం లేదు... నీటిని ఒడిసి పడదాం... భావి తరాలకు నీటిని అందిద్దాం...ప్రతీ ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకుందాం. ఇది నినాదం కాదు... ఆచరణకు అడుగులు...జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు తవ్వించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలుత ఫౌండేషన్ సభ్యులే ఇంకుడు గుంతలు తవ్వించి నీటిని ఎలా ఒడిసి పడుతున్నారో చూపిస్తూ... మీరు కూడా తవ్వుకోండి అంటూ చెబుతున్నారు. వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు.

– గోపాలపట్నం



గోపాలపట్నం హైస్కూల్‌లో తవ్విన ఇంకుడు గంత వద్ద జేడీ ఫౌండేషన్ సభ్యులు

భూగర్భ జలాలను పరిరక్షించాలనే లక్ష్యంతో జేడీ ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరాల్లో ఇంకుడు గుంతల ఆవశ్యకతను.. ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న స్థలాన్ని బట్టి ఎక్కడ గుంత తవ్వితే బాగుంటుంది అనేది కూడా వీరే చెబుతారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని వివరిస్తున్నారు. ఇప్పటి వరకు 5అడుగుల వెడల్పు..5 అడుగుల పొడవు, 6 అడుగుల లోతుతో గొయ్యిలు తీయించారు. ఇవి బేసిక్ కొలతలు... ఇంటి ప్రాంగణం విస్తీర్ణం ఎక్కువగా ఉంటే పొడవు, వెడల్పులు మార్చుకోవచ్చు.

పూడ్చడం ఇలా..

నిర్ణీత సైజులో గుంత తీసుకున్న తర్వాత గొయ్యిలో పెద్ద రాళ్లు వేయాలి. ఆ తర్వాత 40ఎంఎం రాళ్లు, 20ఎంఎం రాళ్లు.. చివరిగా చిప్స్ వేసుకోవాలి. వర్షం నీరు వచ్చినప్పుడు చెత్త రాకుండా సిమెంట్ గట్టు కట్టు కోవాలి. అలా చేసినప్పుడు నీరు భూగర్భంలోకి ఇంకుతుంది. ఇలాంటి చర్యల వల్ల భూగర్భ జలాలను పరిరక్షించడంతో పాటు నీటి సమస్యను అధిగమించవచ్చు.

సందేహాల నివృత్తికి వీరిని సంప్రదించండి..

సలాది శ్రీరామకృష్ణయ్య- 9441517259

కె. అపర్ణ- 9030162463

ముందుకు వస్తున్న ప్రజలు

ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన పెరిగింది. వర్షం నీటిని భూమి లోకి పంపితే ఇది ఒడకట్టి తిరిగి మనకే అందిస్తుందని అర్థం చేసుకోగలుగుతున్నారు. ఇటీవల గోపాలపట్నం హైస్కూల్‌లో జేడీ ఫౌండేష్ సభ్యులు సొంత ఖర్చులతో ఇంకుడు గుంత తవ్వించారు. ఇది వియవంతం కావడంతో పలు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్విస్తున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో సుమారు 20 మంది తవ్వించారు. ఇంకా మరి కొంత మంది తవ్వించేందుకు సిద్ధంగా ఉన్నారని ఫౌండేషన్ సభ్యులు చెబుతున్నారు.



కొత్తపాలెంలో ఇంకుడుగుంతలు తవ్విన వారిని అభినందిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

నీటితోనే మనుగడ



నీరు లేక పోతే మనం లేము... ఆ నీటిని మనం నిర్లక్ష్యం చేయకుండా ఒడిసి పడదాం... ఇదే జేడీ ఫౌండేషన్ ద్వారా నేర్చుకున్నాను. మా ఇంటి ప్రాంగణంలో ఉన్న స్థలంలో ఇంకుడు గుంత తవ్వించాను. దాన్ని సంరక్షించుకుంటున్నాను. భూమిలోకి నీరు ఇంకేలా చేస్తున్నాను. ఈ విధంగా అందరూ చేయాలి.

–వైఎం కాళి, విశ్రాంత రైల్వే ఉద్యోగి, యల్లపువానిపాలెం

భావితరాలకు నీటిని అందివ్వాలి



భావితరాలకు ఆస్తులు అంతస్తులు అందిద్దామని తాపత్రయ పడతాం...అలాగే నీటిని సైతం అందిద్దాం... అందుకు అతి తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం. సొంత ఇల్లు ఉన్నవారంతా ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి. ఎవరికైనా సహాయం కావాలంటే జేడీ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించవచ్చు.

-కె. అపర్ణ, పురుషోత్తపురం

తాగునీటికి తంటాలు

- పరిష్కారం కాని తాగునీటి సమస్య
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, జయేంద్రకాలనీ గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వారం రోజుల తాగనీరు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిమిత్తం తవ్విన గుంతల వల్ల దాదాపు ఏడు చోట్ల తాగునీటి పైప్‌లైన్ దెబ్బతింది. అయితే పైప్‌లైన్ దెబ్బతిన్న ప్రాంతాల్లో 40 మీటర్లు ఒక కాంట్రాక్టర్, మరో 40 మీటర్లు వేరే కాంట్రాక్టర్ పనులు చేస్తుండడంతో ఒకరిపై మరొకరు సాకు చూపుతూ పైప్‌లైన్ మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి అందిస్తున్నా పూర్తి స్థాయిలో అందడం లేదని వాపోతున్నారు. స్థానిక కార్పొరేటర్ సమస్యను పట్టించుకోకుండా డిప్యూటీ మేయర్ ఎన్నికపై దృష్టి సారిస్తున్నారని ప్రజలు, ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరించి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని చెప్పి.. వారం రోజులైనా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సమస్య మరింత జఠిలం కాకముందే ఎమ్మెల్యే చొరవ చూపి సమస్యను పరిష్కరించపోతే ఆందోళన చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



ఎండలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

కుటుంబం చెంతకు మహిళ



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: రబియా అంజుమ్(మధ్యలో ఉన్న అమ్మాయి) మానసిక పరిస్థితి బాగోక ఆర్కే బీచ్ దగ్గర తిరుగుతూ ఉండడం గమనించిన స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్‌కి సమాచారం ఇచ్చారు. ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత సకాలంలో స్పందించి ఆ అమ్మాయిని చికిత్స నిమిత్తం నగరంలోని మెంటల్ కేర్ హాస్పటల్‌లో చేర్పించి 45 రోజులు చికిత్స చేయించారు. తర్వాత వివరాలను తెలుసుకోగా ఊరు కర్ణాటక దగ్గర వినబ్‌నగర్ అని చెప్పింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ సహాయంతో ఆమె కుటుంబ సభ్యులను విశాఖ రప్పించి సోమవారం వారికి అప్పగించారు. ఏడాదిన్నర కిందట తప్పిపోయిన కుమార్తె అప్పగించినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ రబియా కుటుంబ సభ్యులు పోలీసులు, మమత చారిటబుల్ ట్రస్ట్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్త్‌కు 01, మంచినీటి విభాగానికి 01 చొప్పున అర్జీదారులు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం డీఈ సతీష్, ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ రాము

వైభవంగా బంగారమ్మ తొలేళ్లు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వవార్డు బుచ్చిరాజుపాలెం గ్రామ ప్రజలు ఇలవేల్పు బంగారమ్మ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని రెడ్డివీధి రామాలయంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు ఎలమంచిలి చంద్రరావు, గౌరవ అధ్యక్షుడు పురెడ్డి గురు రామిరెడ్డి, కార్యదర్శి గొందేశి రాము, కోశాధికారి దొడ్డి జగదీశ్వర రావు, ఉపాధ్యక్షులు మళ్ల కనకరాజు, కమిటీ సభ్యులు దొడ్డి కనకరాజు(కన్నా), దొడ్డి సతీష్, శరగడం అరుణ్ కుమార్, నైదాన గోపి, నమ్మి రాజు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి పాల్గొన్నారు.



అమ్మవారి ప్రతిమల ఊరేగింపు

ఘనంగా పెంటమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ గులిగిండల లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటామాంబ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించారు. పలు పిండివంటలను సమర్పించారు. మధ్యాహ్నం స్థానిక మహిళలు లలితా పారాయణ చేశారు. సాయంత్రం అమ్మవారి పరస సందడిగా సాగింది. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అమ్మవారిని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,58వ వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య దర్శించుకుని పూజలు చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

గోపాలపట్నం: మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం రామాలయం సమీపంలో సీరపు నూకరాజు(39) తల్లి భార్యా పిల్లలతో నివాసముండేవాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. చిరాకు పడుతూ ఇంట్లోకి వెళ్లి పోయాడు. ఇది రోజూ ఉండే గొడవే కదా అని భార్య వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించగా తలుపులు వేసి ఉండడంతో విరిచి చూశారు. ఇంట్లో హుక్కుకు ఉరి వేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. నూకరాజు రాడ్ బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి బానిసై భార్య ఎర్నికుమారితో నిత్యం గొడవ పడుతుండేవాడు. అదే మాదిరిగా గొడవ పడి ఉరి వేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతునికి భార్యతో పాటు ఒక కొడుకు ఉన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

• ఆస్పత్రికి దారేది?

ఫోకస్



గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల చుట్టూ దుకాణాల ఏర్పాటు చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఆస్పత్రి లోపలికి వెళ్లేందుకు దారి లేకుండా దుకాణదారులు మూసేస్తున్నారు. చుట్టూ దుకాణాలు ఉండడంతో కొత్తవారు అక్కడ ప్రభుత్వ పశువుల ఆస్పత్రి ఉందనేది గుర్తించలేకపోతున్నారు. దీంతో ఆస్పత్రి సేవలు వినియోగించుకునేందుకు ఆటంకం కలుగుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఆస్పత్రి చుట్టూ ఉన్న దుకాణాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. – విశాఖ విద్య

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

మల్కాపురం: వేసవి శిక్షణ తరగుతుల్లో భాగంగా స్థానిక మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కులో చిన్నారులకు బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న సుమారు 30 మంది చిన్నారులకకు అవసరమైన పౌష్టికాహారాన్ని సోమవారం హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్ మజ్జి సోమేష్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. చదువు విజ్ఞానాన్ని అందిస్తే,క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం ఇస్తాయని వివరించారు. కార్యక్రమంలో మజ్జి రమేష్ పాత్రుడు,ప్రసాద్ పాత్రుడు, షైక్ అలీ,కఠారి సునీల్,ప్రభు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న మజ్జి సోమేష్

స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత

- స్టేషన్‌కు నాయకుల తరలింపు
- పోలీసుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. స్టీల్ ప్లాంట్ సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నాయకులు సన్నాహాలు చేశారు. పోలీసులు బహిరంగ సభకు అనుమతి నిరాకరించారు. దీంతో సమ్మె జయప్రదం చేయాలని కార్మికులకు చెబుదామని నాయకులు రోడ్డు ఇరువైపులా ఉండి అప్పీలు చేయసాగారు. ఈలోగా అక్కడకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకుని నాయకులను నిలవరించే ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులు ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావుతో పాటు కొంత మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్మికులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. శాంతియుతంగా ప్రచారం చేస్తున్న తమతో పోలీసులు వ్యహరించిన తీరును నిరసిస్తూ కార్మికులు బైఠాయించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నాయకులకు నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించేశారు.



పోలీసుల తీరును నిరసిస్తున్నసిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, కార్పొరేటర్ గంగారావు

పోలీసుల తీరు సరికాదు

సమ్మె ప్రాధాన్యతపై ప్రచారం చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఉద్యమాలను పోలీసులచే అణగదొక్కాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.



కార్మికులను, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



• గుంతలు పూడ్చేదెప్పుడో!

ఫోకస్

ఎన్‌ఏడీ ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పొక్లెయిన్‌తో రోడ్డు మధ్యలో గుంతలు తీస్తున్న వారు పని అయిన తర్వాత వాటిని సవ్యంగా పూడ్చడం లేదు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెంలో పలు చోట్ల ఇదే తీరుగా ఉంది. రహదారి మధ్యలో భారీగా గుంతలు వదిలేయడంతో రాత్రి వేళ ఆ దారుల్లో ద్విచక్రవాహనదారులు ఫల్టీ కొడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారి మధ్యలో ఉన్న గుంతలను సకాలంలో పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు. - విశాఖ విద్య

కుటుంబం అదృశ్యం

- లక్కీ డ్రా, చీటీలు నిర్వహిస్తూ నష్టాలు
- ఒత్తిడి భరించలేక పరారైనట్టు కేసు

అక్కిరెడ్డిపాలెం: లక్కీ డ్రా, చీటీలు నిర్వహిస్తూ నష్టాలు రావడంతో పాటు కట్టిన వారు ఒత్తిడి తట్టుకోలేక తండ్రి, భార్య, కుమార్తె అదృశ్యం అయ్యారు. దీంతో కుటుంబ సభ్యురాలి పిర్యాదు మేరకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు మిస్సింగ్ కేసు నమోదైంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఒక అద్దె ఇంట్లో అప్పాగతుల చిన్నారావు , పార్వతి, రేవతి కుటుంబం నివసిస్తోంది. చిన్నారావు గత కొద్ది కాలంగా స్థానికుల నుంచి లక్కీ డ్రా, చీటీలు నిర్వహిస్తున్నాడు. గత కొద్ది నెలలుగా ఈ వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు, చీటీలు, లక్కీ డ్రాలో డబ్బులు పెట్టిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారావు, పార్వతి, రేవతి ఏప్రిల్ 6వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయారు. తమ అల్లుడు, కుమార్తె , మనవరాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన అనసూయ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు ముగ్గురు వ్యక్తులు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్కీ డ్రా , చీటీల నిర్వహణలో వచ్చిన నష్టాలు, ఒత్తిడి కారణంగానే వారు అదృశ్యమయ్యారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com